ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024
5
విజయనగరం

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజనం కీలకమని, ఎండిఎం కార్మికులు అన్నపూర్ణకు ప్రతిరూపమని డిప్యూటి డిఇఒ కె.వి.రమణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండిఎం కార్మికులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న మహిళలు విద్యార్థులకు భోజన సదుపాయం అందించడంలో ఎంతో కష్టపడుతున్నారన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం మరింత రుచిగా అందించేందుకు ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ప్రత్యేక వీడియోల ద్వారా రుచికరమైన పౌష్టికహారాన్ని ఎలా వండాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎండిఎం కో ఆర్డినేటర్ కె సత్యం, నెల్లిమర్ల, విజయనగరం, గుర్ల ఎంఇఒలు యు.ఎస్.ఎన్. మూర్తి, సిహెచ్ ఆనంద మూర్తి, ఎం శ్రీనివాసరావు, ఆర్‌పిలు సిఆర్ఎంటిలు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాగారం వాటర్ ఫాల్స్ వద్ద సరదాగా నదిలో స్నానం చేద్దామని విజయనగరం నుంచి వెళ్లిన విద్యార్థుల్లో ముగ్గురు మృత్యువాత పడడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. నదిలో స్నానం కోసం దిగిన వీరు లోతట్టు ప్రాంతాన్ని గమనించక పోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఒకరి ప్రాణాలను కాపాడేందుకు ఒకరు దిగి చివరికి ముగ్గురు విద్యార్థులు విగత జీవులుగా మారారు. ఈ సంఘటనతో అటు జాగారంలోను, విద్యార్థులు నివాసముంటున్న కంటోన్మెంట్ ప్రాంతంలోను తీవ్ర విషాదం అలముకుంది.

నది వద్ద గుమిగూడిన జనం

ప్రాణాలు తీసిన ఈత సరదా

- జాగరం వాటర్‌ఫాల్స్ వద్ద ఘోరం • ఒకరిని కాపాడబోయి ఒకరు మత్యువాత
- కంటోన్మెంట్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి

మృతుడు షాఖిబ్

గుల్లపాటి అనిల్

అస్రఫ్ హుస్సేన్

ప్రజాశక్తి - జామి/విజయనగరంకోట

జామి మండలం జాగారం గ్రామం వద్ద గోస్తనీ నదిపై వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు విజయనగరం కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు మంగళవారం ఉదయాన్నే వెళ్లారు. వాటర్ ఫాల్స్ వద్దకు చేరుకుని దిగువన నదిలో స్నానం చేస్తుండగా, గుల్లపాటి అనిల్ (14) అనే విద్యార్థి తొలుత నీటిలో మునిగిపోయాడు. అతన్ని కాపాడేందుకు ప్రయత్నించిన స్నేహితుడు మహ్మద్ అస్రఫ్ హుస్సేన్ (17) కూడా గల్లంతయ్యాడు. దీంతో మహమ్మద్ షాఖిబ్ ఖాన్ (16) నదిలో నుంచి బయలకు వచ్చి పెద్దపెద్ద కేకలు వేశాడు. ఎవరూ స్పందించకపోవడంతో ఆ విద్యార్థి కూడా వారిని కాపాడేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న మిగతా ముగ్గురూ అరుపులు కేకలు పెట్టి వెంటనే స్థానికులకు సమాచారమిచ్చారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వీరబాబు హుటాహుటిన అక్కడకు చేరుకొని యువకుల కోసం గాలింపు చేపట్టారు. ఎస్.కోట ఫైర్ సిబ్బంది కూడా గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో విశాఖ నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను రప్పించారు. మధ్యాహ్నం 1.30గంటలకు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. నదిలో ఇసుక తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాటిలో కూరుకుపోయి మృతి చెందిన ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలతో జాగారం ప్రాంతంలో విషాదం అలముకుంది. మృతదేహాలను పోస్టుమార్టం జిల్లా కేంద్రానికి తరలించారు. సిఐ ఉపేంద్ర పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాగారం వాటర్ ఫాల్స్ నిషేదం

విజయనగరం, విశాఖ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అత్యధికంగా జాగారం వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు వస్తుంటారు. గతంలో పలువురు ఇక్కడ స్నానానికి దిగి మృత్యువాత పడడంతో అధికారులు ఈ వాటర్ ఫాల్స్‌ను నిషేదించారు. కొంత కాలం పోలీసులు పహారా కూడా కొనసాగింది. కానీ సందర్శకులను నిలువరించ లేకపోయారు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వాటర్ ఫాల్స్ ను నిషేదించడంగాని, ప్రమాదాల బారిన పడకుండా ఏర్పాట్లుగానిచేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కంటోన్మెంట్‌లో తీవ్ర విషాదం

కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు ముస్లిం విద్యార్థులు మృతి చెందడంతో తీవ్ర విషాదం అలముకుంది. కళ్లెదుటే తమ స్నేహితులు నదిలో గల్లంతై విగత జీవులుగా మారడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలకు జిల్లా కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మృతి చెందిన గుల్లపాటి అనిల్ కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లితండ్రులకు మూడో సంతానం. మహమ్మద్ షాఖిబ్ ఖాన్ నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు మృతితో తండ్రి షిరాజ్‌ఖాన్ కన్నీరుమున్నీరయ్యారు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు షిరాజ్‌ఖాన్. అస్రఫ్ హుస్సేన్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. అన్వర్ హుస్సేన్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు అస్రఫ్ హుస్సేన్ ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో ఆయన రోధించాడు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక
- అభ్యర్థులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన

రాజకీయ పార్టీల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా ఎస్‌పి దీపిక కోరారు. విజయనగరం పార్లమెంటు స్థానంలో పోటీ చేసిన అభ్యర్థులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, చట్టపరమైన అంశాలను పవర్ పాయింట్ ద్వారా కలెక్టర్ వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఏజెంట్ల కరదీపికలను పంపిణీ చేశారు.

జిల్లాలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని, అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇవిఎంలలోని ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కించడానికి వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం ప్రతీ కేంద్రంలో 14 టేబుళ్ల చొప్పున, పోస్టల్ బ్యాలెట్ కోసం 4 టేబుళ్ల చొప్పన, ఇటిపిబిఎంఎస్ ఓట్ల లెక్కింపు కోసం అదనంగా మరో టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం పార్లమెంటు కు పోలైన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం లెండి కళాశాలలో 20 టేబుళ్లతో మరో లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతీ టేబుల్ దగ్గర ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకొనే అవకాశం అభ్యర్థులకు ఉందని చెప్పారు. వీరు కాకుండా ఆర్ఓ దగ్గర అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్ కూర్చొనే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందుగానే ఫారమ్ 18 ద్వారా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తు చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఏజెంట్ల వివరాలను అందజేస్తే, వారికి వెంటనే గుర్తింపు కార్డును జారీ చేస్తామని చెప్పారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలవుతుందని, అరగంట తరువాత ఇవిఎంల లెక్కింపు ప్రారంభమవు తుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద ఏజెంట్లుకు, సిబ్బందికి వేర్వేరుగా పార్కింగ్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మూడు దశల్లో తనిఖీ నిర్వహిస్తారని, కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌పోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని స్పష్టం చేశారు. పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామని, అక్కడ సెల్‌ఫోన్లు డిపాజిట్ చేసి, అవసరమైనప్పుడు అక్కడే మాట్లాడుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి తాగునీరు కూడా అనుమతించబోమని స్పష్టం చేశారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలవద్ద ఉదయం 7 గంటలకల్లా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలని, ఇతర టేబుళ్ల దగ్గరకు, ఇతర నియోజక వర్గాలకు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతీఒక్కరూ తమ గుర్తింపు కార్డును విధిగా ధరించాలని చెప్పారు. ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా సంబంధిత ఆర్ఓకు లేదా ఎఆర్ఓకు అందజేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెంట్లు ప్రవర్తిస్తే, వారిపై చర్య తీసుకొనే అవకాశం ఆర్‌ఓలకు ఉందని తెలిపారు. ఏజెంట్లు డబ్బు చెల్లించి అల్పాహారం, భోజనం పొందవచ్చునని సూచించారు.

ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాలు, వాటి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. లెక్కింపు కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని, అందువల్ల ఇతరులు ఆ ప్రాంతాలకు రాకుండా చూడాలని కోరారు. ఏజెంట్ల గుర్తింపు కార్డులను, తమ వద్దనున్న జాబితాలో తనిఖీ చేసిన తరువాతే లోపలికి పంపిస్తామని స్పష్టం చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుందని, ప్రతీచోటా తనిఖీ జరుగుతుందని తెలిపారు. వాహనాలను లోపలికి అనుమతించబోమని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అందువల్ల ఫలితాల తరువాత ఊరేగింపులు, ప్రదర్శనలు చేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఊరేగింపుల్లో బాణాసంచా కాల్చవద్దని ఎస్‌పి సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఇతర అధికారులు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

జూన్ 4 న జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ఇందుకు గానూ 289 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 340మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 343 మంది మైక్రో అబ్జర్వర్లను కలిపి మొత్తం 972 మందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో జెసి కార్తీక్, డిఆర్ఒ అనిత, డిఐఒ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖాధికారి రామారావు

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి విటి రామారావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు హెచ్చరించారు. స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్లో మంగళవారం డీలర్లు, రైతు భరోసా వ్యవసాయ సహాయకులతో ఖరీఫ్ సాగుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు రైతులకు సంపూర్ణంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు అమ్మితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పచ్చిరొట్ట, వరి విత్తనాలు, ఎరువులు పంపిణీపై వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఎడిఎ మజ్జి శ్యామసుందర్ మాట్లాడుతూ విత్తన, పురుగుమందు చట్టాలను అమలు చేయాలన్నారు. అమ్మకాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా కార్యాలయ సహాయ సంచాలకులు ఆర్.అన్నపూర్ణ, నాలుగు మండలాల ఎఒలు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకాన్ని ఆపాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రైవేట్ విద్యా సంస్థలలో పుస్తకాలు అమ్మకాలను ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో దోపిడీ చేయడానికి అనేక మార్గాలు సృష్టించు కుంటున్నాయని, దీనిలో భాగంగా పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా చేస్తున్నాయని అన్నారు. విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకాలపై ఎస్ఎఫ్ఐ బృందం విద్యాశాఖ అధికారులకు తెలియజేసిందని, అధికారులు స్పందించి రెండు పాఠశాలలో పుస్తకాల గదులను సీజ్ చేశారని తెలిపారు. జిల్లాలో పలు స్కూళ్లలో పుస్తకాల పేరుతో దోపిడీ జరుగుతుందని, వెంటనే విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిఇఒను కలిసి వినతి అందజేశారు. స్పందించిన డిఇఒ పుస్తకాల విక్రయాలను అడ్డుకున్నందుకు ఎస్ఎఫ్ఐ బృందాన్ని అభినందిస్తూ ఇలాంటి చట్ట వ్యతిరేక పనులకు ఒడికడుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపాడు.ఎస్.కోటలో నారాయణ ఒలింపియాడ్ పేరుతో కేంబ్రిడ్జి స్కూల్ నడుపుతున్నారని, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఈపాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరగా, చర్యలు తీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, సహాయ కార్యదర్శి పి.రమేష్, కె.రాజు, వెంకటరమణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని రమ్యను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

సత్య కళాశాల విద్యార్థికి బిబిఎలో మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బిబిఎ కోర్సు చదువుతున్న కె. రమ్య 9.07 గ్రేడ్ పాయింట్లతో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో మొదటి ర్యాంకు సాధించింది. ఊర్మిక 8.86 గ్రేడ్ పాయింట్ల తో రెండవ స్థానం సాధించారు. బిఎస్‌సి కోర్సులో ఎంపిసి గ్రూపు లో జె. గుణశేఖర్ 8.95, ఎంపిసిఎస్ గ్రూపులో డి.కార్తీక్ 8.46, ఎంసిసిఎస్ గ్రూపు లో ఎన్. జోషన్ కుమార్ 8.86, సిబిజెడ్ గ్రూపులో టి.కీర్తి 8.81, ఎ.శ్రావణి 8.77, బి కామ్‌లో కె.వైష్ణవి 8.42, పి.అస్రిత 8.31, బిఎలో డి.మానస 8.42 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు అభినందించారు. రమ్య మరియు ఊర్మిక మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి , ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్. గోపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణీల పట్ల అప్రమత్తం : డిఎంహెచ్ఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

హైరిస్క్ గర్భిణీ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ . భాస్కరరావు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతృ శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. మార్చి, ఏప్రిల్‌లో జిల్లాలో సంభవించిన మూడు మాతృ మరణాలు, ఆరుశిశు మరణాలపై ఉప కమిటీ సమీక్షించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది హైరిస్క్ గర్భిణీ కేసులు గుర్తించిన నాటి నుంచి ప్రసవించే వరకు అన్ని సేవలు అందించాలన్నారు. రిస్క్‌ను తగ్గించే విధంగా గర్భిణీ దశ నుంచే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి క్షేత్రస్థాయిలో సందర్శనలు చేసి వారికి అవగాహన కల్పించా లన్నారు కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎం.సత్యవతి, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రొఫెసర్ హెచ్ఒడి డాక్టర్ అరుణ శుభశ్రీ, జిఎంసి ఆర్.సుజాతదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ, డెమో సిబ్బంది చిన్నతల్లి, రత్నకుమారి, హెచ్ఇఒ, 108 కోఆర్డినేటర్ నాజీర్, పిహెచ్‌సిలు, పారా మెడికల్ సిబ్బంది , ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని కాపాడుకోవాలి

కూలీలనుఉద్దేశించి మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి-కొత్తవలస

కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి చట్టాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు పిలుపు నిచ్చారు. మంగళవారం పాత సుంకరపాలెం, సన్యాసి పాత్రుని చెరువులో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి బిజెపి, వైసిపి తూట్లు పొడుస్తున్నాయని అన్నారు. ఇప్పటికే సరియైన కూలి రాక, చాలీచాలని వేతనంతో రెండుపూటలా పనిచేయాల్సి వస్తోందని అన్నారు. ఒక పూటే పని పెట్టాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, 200రోజులు పని కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోగికి నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యులు

ఘనంగా కోలగట్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు మంగళవారం నగరంలో ఘనంగా జరిగాయి. వైసిపి నాయకులు పలు ప్రాంతాల్లోని దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేసారు. వైసిపి ఆధ్వర్యాన కోలగట్ల స్వగృహంలో భారీ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కోలగట్ల కృష్ణారావు, తమ్మన్న శెట్టి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జ్ బొద్దాన అప్పారావు పాల్గొన్నారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో పైడితల్లమ్మ దేవస్థానం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొని పేదలకు ఆహారాన్ని అందించారు. సర్వజన ఆస్పత్రి, ఘోషాసుపత్రి, ప్రేమ సమాజంలో రోగులకు, వృద్ధులకు ఆయా జోనల్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. బాబా మెట్ట, రింగ్‌రోడ్ తదితర ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. దాసన్నపేటలో చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. రంగాల వీధిలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, జోనల్ ఇన్‌ఛార్జిలు, కార్పొరేటర్లు, కోలగట్ల అభిమానులు పాల్గొన్నారు.

తోటపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

కోలగట్ల జన్మదినం సందర్భంగా వైసిపి ఆధ్వర్యాన తోటపాలెంలోని ఎంపియుపి స్కూలులో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. వెంకటరమణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికకి చెందిన వైష్ణవ్ ఐకేర్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని 32వ డివిజన్ కార్పొరేటర్ రంగారావు ప్రారంభించారు. జోనల్ ఇన్‌ఛార్జి బాల బ్రహ్మారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి, 32వ డివిజన్ వైసిపి అధ్యక్షులు ఆర్లె కృష్ణారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేషరతుగా లాకౌట్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక జిందాల్ పరిశ్రమను లాకౌట్‌ను బేషరతుగా ఎత్తివేసి యధావిధిగా తిప్పాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు కోరారు. మంగళవారం కంపెనీ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి పాటలతో ఉర్రూతలూగించారు. కార్మికులలో నూతన ఉత్తేజాన్ని కలిగించారు. ఊగిసలాటలాడుతున్న కార్మికులకు తమ పాటలతో ఉత్సాహాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా జిందాల్ పరిశ్రమను లాకౌట్ పేరుతో మూసివేసి కార్మికులను రోడ్డున పడేయడం విచారకర మన్నారు. కంపెనీలో 30-40 ఏళ్ల నుంచి పనిచేసిన కార్మికులు, రిటైర్మెంట్ దగ్గర పడుతున్న కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇన్నేళ్లు కార్మికుల రక్తాన్ని పిండి వృద్ధాప్యంలో పక్కకు నెట్టడం సమంజసం కాదని, బేషరత్‌గా లాకౌట్ ఎత్తివేసి కంపెనీ తిప్పాలని డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడాన్ని తప్పు పట్టారు. కంపెనీ మూసివేసి నేటికీ 12 రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలన్నారు. మంగళవారం వంటావార్పు కోన తాతబాబు సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పన్న పాలెం సర్పంచ్ కోన దేవుడు, జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి నాయకులు ఈశ్వరరావు

వికలాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో వికలాంగ పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలు పిల్లల కోసం మే1 నుంచి జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వికలాంగ పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ ఇటువంటి పిల్లల కోసం ప్రభుత్వం విద్యా బోధనలతో పాటు ట్రాన్స్‌పోర్టు, స్టైయిఫండ్, రీడర్ అలవెన్స్, ఉపకార వేతనాలు, ఉచిత ఉపకరణాలైన వీల్ చైర్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మానసిక ఆరోగ్యానికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఉన్నత చదువుల ప్రోత్సాహకం కోసం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మినిమం 10 మార్కులు సాధిస్తే పాస్ అయినట్లు ప్రకటిస్తారని, సహాయకులతో పరీక్ష రాసే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి చింతల రాజేశ్వరి పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న ఎంఇఒ తిరుమల ప్రసాద్

ప్రభుత్వ స్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ స్థలం అక్రమాలపై చర్యలు తీసుకోవాలని 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, అలబాని వీధి వాసులు కోరారు. మంగళ వారం వారు విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధి అలబాని వీధి సర్వే నంబర్ 312లో రాస్తాలో అదే విధికి చెందిన పి.కిరణ్ అనుచరులు పి.శ్రీనివాసరావు, కె.కన్నం నాయుడు, జి. రామకృష్ణ అనే వారు జెసిబితో గోతులు తవ్వి మధ్యలో పూరిపాక వేసి ఆక్రమించుకున్నారని తెలిపారు. రాస్తా కప్పి వేయడం వల్ల అలబాని వీధి వాసులు ఇబ్బందులు పడుతున్నారని అక్రమాలు తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జెసిబితో గోతులు తవ్వుతున్న అక్రమార్కులు

నవధాన్యాలు సాగుతో నేలకు మేలు

ప్రజాశక్తి- గరివిడి

నవధాన్యాలు సాగుతో నేలతల్లికి మేలు జరుగుతోందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం గెడ్డపువలసలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో తొలకరి వర్షాలు ముందుగా రైతులందరూ నవధాన్యాలు సాగు చేయాలన్నారు. ఎకరానికి 12 కేజీలు విత్తనాలు చల్లుకోవాలని తద్వారా నేల సారవంతంగా ఉంటుందని సూచించారు. నేలలో ఉండే సూక్ష్మజీవులు సంవృద్ధిగా అభివృద్ధి చెంది మొక్కలకు అందిస్తాయని, నేల కోతకు గురికాకుండా ఉంటుందని చెప్పారు. ఈ సంవత్సరం ప్రతి రైతు తనకున్న విస్తీర్ణంలో నవధాన్యాలు సాగు చేయించాలని కోరారు. ఈ నవధాన్య కిట్లు రైతు భరోసా కేంద్ర పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జీలుగులతో పాటుగా వీటిని కలిపి చల్లుకుంటే భూసారం పెరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిఎ సూరిబాబు, యూనిట్ ఇంచార్జి సింహాచలం, తుమ్మగంటి సుశీల, చీడి రామకృష్ణ, సిగ అనసూయ, మీసాల గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

342 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక పిహెచ్‌సిలో మంగళ వారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 342 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సీతాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల, గైనిక్, జనరల్, కళ్ల డాక్టర్లు నాలుగు విభాగాలకు చెందిన డాక్టర్లు సేవలు అందించారన్నారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు, పెందుర్తి సిహెచ్‌సిలోని ఆర్తో, న్యూరోకు రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె. ధర్మారావు, మేజర్ పంచాయతీ ఇఒ కన్నబాబు, పిహెచ్ఎన్. రవణమ్మ, హెచ్.వి బేబీ రాణి, హెచ్ఎస్ సూరిదేముడు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సీతాలక్ష్మి

ఓట్ల లెక్కింపుపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలు, వివి పేట్‌ల లెక్కింపుపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాలకొండ, పార్వతీపురం ఆర్‌డిఒలు, ఎన్నికల అధికారులు వివి రమణ, కె.హేమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన కల్పిస్తూ ఏ విధంగా బాధ్యతలు నిర్వహించాలన్నది ఆడియో విజువల్ విధానం ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంబంధిత నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని ఇంటికి పండగకు వెళ్తూ..

కలవరాయి వద్ద రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్నేహితుని ఇంటికి పండగకు వెళ్లి సరదాగా గడపాలని అనుకున్నారు ఆ ముగ్గురు యువకులు. స్నేహితుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో ఒకరు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బొబ్బిలి మండల రాముడువలసకు చెందిన తొనంగి సాయి, మెట్టవలస గ్రామానికి చెందిన పువ్వల వంశీ, మక్కువ మండలం పెద్దవలసకు చెందిన సుబ్బారావులు గాయత్రి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. గొంగాడవలస గ్రామదేవత పండుగ జరగడంతో స్నేహితుని ఇంటికి వెళ్లేందుకు ముగ్గురు స్కూటీపై బయలుదేరారు. మితిమీరిన వేగంతో వెళ్లడంతో కలవరాయి సుభద్ర జంక్షన్ వద్ద స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న షాపును ఢీకొనడంతో సాయి(20) అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బారావు, వంశీ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరు యువకులను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పండగకు వెళ్తూ ప్రమాదం జరగడంతో గొంగాడవలసలోను, మృతుడు సాయి గ్రామం రాముడువలసలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన సాయి

94 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

భోగపురం గ్రామంలో 94 మద్య సీసాలతో బొడ్డ అప్పలరాజు అనే వ్యక్తి స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకుని స్థానిక సెబ్ అధికారులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల కేంద్రంలో ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతంలో జరజాపు పేట, మొయిద కాజ్ వే, రామతీర్థం కాజ్ వే, జ్యూట్ మిల్ సమీపంలో వంతెన, కుదిపి నీలం రాజు పేట సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, నాటు బల్లు, ద్వి చక్ర వాహనాల ద్వారా తరలించి వేరే ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. రాత్రి పూట లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జ్యూట్ మిల్ బ్రిడ్జి వద్ద నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఎడ్ల బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడి నిర్మాణాలు పేరిట ఇసుక అక్రమంగా తరలించి వేలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నారని సమాచారం. మంచి నీటి పథకాల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇసుక అక్రమ రవాణాపై మొక్కు బడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుం టున్నారు. ఇటీవలి ఎస్ఇబి అధికార్లు ఆటోతో తరలిస్తున్న ఇసుకను స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అయినా సరే అక్రమార్కులు వెనక్కు తగ్గకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక తరలింపును ఎస్ఇబి, రెవెన్యూ అధికార్లు, పోలీ సులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకుంటేనే అక్రమ రవాణా ఆగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మినీ ఆటోలతో తరలి పోతున్న ఇసుక

ప్రభుత్వ కార్యాలయాల రహదారే చీకటి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో మిమ్స్ బ్రిడ్జి దిగువున ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి చీకటమయంగా ఉంటుంది. ఈ రహదారిలో పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కెజిబివి కళాశాల, వసతి గృహం, ఎంపిడిఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఎంజెపిఎపి బిసి కళాశాల, వసతి గృహంతో పాటు అనేక కార్యాలయాలు, ఇల్లులు వున్నప్పటికిని ఆ రహదారిలో విద్యుత్ కాంతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు స్థంభాలు అమర్చినప్పటికీ విద్యుత్ బల్బులు అమర్చక పోవడం పట్ల రాత్రి పూట ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ కార్యాలయ సిబ్బందులు వాహనాలతో చీకట్లో పడిపోతున్నామని శ్రీ గోపినాదం సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థపాక అధ్యక్షులు నాడిశెట్టి శాంతారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్వయంగా పర్యటించి అక్కడ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు.

విద్యుత్తు దీపాలు లేని రోడ్డు ఇదే..

చివరి దశలో నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి - వేపాడ

నాడు నేడులో ప్రారంభించిన పాఠశాల నిర్మాణ పనులు చివరి దశలో బిల్లులు అందక ఆగిపోయాయి. మరో రెండు వారాల్లో పాఠశాలలు ప్రారంభం కానుండగా తరగతి గదులు చాలక విద్యార్థులకు పాత కష్టాలే పునరావృతం కావడం ఖాయమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నీలకంఠ రాజపుర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దుంగాడ ఎంపిపి పాఠశాల భవనం, బక్కు నాయుడుపేట కెజిబివి వసతి గృహంలో పదో తరగతి అదనపు భవనం నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను వివరణ కోరగా ఇంతవరకు చేసిన పనులకు, ఇక ముందు చేయాల్సిన పనులకు బిల్లులు, సిమెంట్ మంజూరు చేయాలని ఎంఇఒకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు.

మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవనం

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - తెర్లాం

గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం బాల బాలికల హక్కులు, విధులు, చట్టాలపై సచివాలయం మహిళా పోలీసు తులసి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పిల్లలకు కేరం బోర్డు పోటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె. విష్, గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

కొత్తవలస: విద్యార్థులు బాల్యం నుంచే అన్ని విషయాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని స్థానిక లైబ్రేరియన్ ఎం. రామలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక లైబ్రరీలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ విద్యార్థులతో మాట్లాడుతూ పిల్లలు నిరంతరం నేర్చుకోవాలని, అప్పుడే తెలియని విషయాలు తెలుసుకోగలుగుతామని చెప్పారు. అనంతరం పిల్లలచే కథలు పుస్తకాలు చదివించారు.

తెర్లాం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తులసీ

వివాదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలని ప్రజోప్రాయ సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి. దుర్గయ్య అన్నారు. మండలంలోని నందిగాం పంచాయతీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాలతో ఆనందంగా ఉండాలంటే ముందు వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. వివాదాలకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన అన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి కళ్యాణి మాట్లాడుతూ మీ పంచాయతీ వివాదాలకు దూరంగా ఉండి వివాద రహిత పంచాయతీగా మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. రానున్న రోజుల్లోనూ వివాదాలకు దూరంగా ఉండి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సిఐ ఏ రవికుమార్, తహశీల్దార్ శ్యాం ప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను పోలీస్ స్టేషన్ వరకు రాకుండా గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాలన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదేవిధంగా ఉండి మిగతా పంచాయతీలకు ఆదర్శంగా ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ గరే మురళి మాట్లాడుతూ పంచాయతీలోని ప్రజలందరూ సహకారంతోనే వివాద రహిత గ్రామంగా పేరు సాధించగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ తాడిరాజు, ఎస్ఐ తాతారావు, విద్యాశాఖాధికారి రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్నలోక్ అదాలత్ చైర్మన్ జి. దుర్గయ్య

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండగలరని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఎం.బూర్జవలస, రంగరాయపురం, నారసింహునిపేట, ఐటిఐ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, జెండావీధి, చెరువుగట్టుపై అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం ఋతు క్రమన-వ్యక్తిగత పరిశుభ్రత అంశంపై అవగాహన కల్పించారు. ఋతు క్రమనాలు వచ్చే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, మహిళా కానిస్టేబుల్స్, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

కిషోర్ బాలికలకు అవగాహన

తెర్లాం: మండలంలోని పెరుమాలి అంగన్వాడి కేంద్రంలో కిషోర్ బాలికలకు ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు సమయానికి ఫీడింగ్ అందుతుందా లేదా అని పిల్లల తల్లిదండ్రులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రీ స్కూలు పిల్లల విద్యా నైపుణ్యత గురించి బోధన విధానాల గురించి అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు తాగునీరు లేక స్కూలు ఆవరణలో ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా పిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని పిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెరుమాలి సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తి నిచ్చింది

గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-విజయనగరం

సమాజంలో అట్టడుగున ఉన్న గిరిజనులకు చదువు చెప్పడంతో పాటు వారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తానని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి టి. చందరశేఖరరావు అన్నారు. కష్టపడి పని చేస్తే సమాజంలో మంచి గుర్తుంపు ఉంటుందన్నారు. తాను పనిచేసిన ప్రతి ప్రాంతంలో అందరినీ కలుపుకొని పనిచేయడం వలన ఉద్యోగ జీవితాన్ని అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేయగలిగానని చెప్పారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన తన జీవిత విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మాది జియమ్మవలస మండలం గెడ్డతిరువాడ గ్రామం. తల్లిదండ్రులు గుంపస్వామి, సుమిత్ర వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తూ తనతో పాటు ముగ్గురు అన్నయ్యలను, ఇద్దరు అక్కచెల్లెలను చదివించారు. ఇద్దరు అన్నయ్యలతో పాటు నేను కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డాం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు గెడ్డతిరువాడలో విద్యాభ్యాసం సాగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చినమేరంగి హైస్కూల్, ఇంటర్ పార్వతీపురంలో చదువుకున్నాను. డిగ్రీ చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. 1984 జనవరి 18న స్కూల్ అసిస్టెంట్ గా జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభించాను. అక్కడ 1986 వరకు పనిచేశాను. 1986 నుంచి 88 వరకు పిటి మండ, 1988 నుంచి 90 వరకు ఉదయపురం, 1990 నుంచి 2000 వరకు జరడ, 2000 నుంచి 2022 వరకు మరల పిటి మండ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించాను. 2002లో వసతి గృహ సంక్షేమ అధికారిగా సాలూరు ఎస్‌టి హాస్టల్‌లో హెచ్‌డబ్ల్యుఒగా బాధ్యతలుచేపట్టాను. 2004లో కురుపాంకు బదిలీపై వచ్చి 2011 వరకు పని చేస్తుండగా గ్రేడ్ 1 హెచ్‌డబ్ల్యుఒగా ఉద్యోగోన్నతిపై రేగిడి ఆశ్రమపాఠశాలకు 2013లో వచ్చాను. తరువాత ధర్మలక్ష్మీపురం బదిలీ అయి 2015వరకు పనిచేశాను. ఇక్కడ పని చేస్తున్నప్పుడే ఎటిడబ్ల్యుఒగా ఉద్యోగన్నతి రావడంతో కురుపాం వెళ్లాను. 2017లో విశాఖ జిల్లా చింతపల్లికి బదిలీ అయ్యింది. ఇక్కడ 2022 వరకు పని చేశాను. కొత్త జిల్లాల ఏర్పాటుతో విజయనగరం జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిగా బాధ్యతలు చేపట్టాను. 2006, 2007లో వరుసగా రెండుసార్లు పార్వతీపురం ఐటిడిఎ పిఒ చేతులమీదుగా, 2012 అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్య, 2016లో కలెక్టర్ నాయక్, 2022లో పాడేరు ఐటిడిఎ పిఒ, 2023లో ప్రస్తుత కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాలు అందుకున్నాను.

సంతృప్తి నిచ్చే సంఘటనలు

కురుపాం రేగిడి ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసినప్పుడు వరుసగా రెండేళ్ల పదోతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం మర్చిపోలేనిది. చింతపల్లి మండలం బలపం ఆశ్రమ పాఠశాలను నాడు- నేడు కింద సుందరంగా తీర్చిదిద్దాను. ఎక్కడ నుంచో వలస వచ్చి షికారుగంజిలో స్థిరపడిన గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాను. ఎస్ కోట, మెంటాడ మండలాల్లో 10.6కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయించడం, జిల్లాలో 250 గిరిజన కుటుంబాలకు కుళాయిలు మంజూరు, మెంటాడ మండలంలో జనధన్ వికాస్ కేంద్రం మంజూరు వంటి పనులు నా ఉద్యోగ జీవితంలో మరిచిపోలేనివి.

నా 41సంవత్సరాల ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడంలో కుటుంబ సభ్యులు సహకారం మరువలేనిది. ఉన్నాతాధికారులు, సిబ్బంది, సహచరులు పూర్తి సహాయ సహకారాలు అందించడంతో విజయవంతంగా పూర్తి చేయగలిగాను. వారందరికీ ధన్యవాదాలు.

సీతంలో ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి విద్యార్థుల వార్షిక ట్రైనింగ్ క్యాంపు మంగళవారం ప్రారంభమైంది. క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ ఈ శిబిరంలో పది రోజులు ఎలా ఉండాలో ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో పేర్కొన్నారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వలన నీరు ఎక్కువగా తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. పరిశుభ్రత పాటించాలని, యువత భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, దేశ అభ్యున్నతికి కృషి చేయాలని చెప్పారు. శిబిరంలో డిప్యూటీ క్యాంప్ కమండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సుబేదర్ మేజర్ బొడ్డే పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్స్ లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, థర్డ్ ఆఫీసర్ వెంకట రత్నం, లెఫ్టినెంట్ సంతోషి, థర్డ్ ఆఫీసర్ ఎ. వరలక్ష్మి, తులసి, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

వల్లంపూడిలో అన్నదానం

వేపాడ: మండలంలోని వల్లంపూడిలోని పైడితల్లమ్మ పండగ సందర్భంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పరిసర గ్రామాలైన వేపాడ, ఆకుల సీతంపేట, ఆతవ, గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణప్పడు

దాతల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని వెంపడాంకు చెందిన తండ్రీ కొడుకు బాదా నారాయణప్పడు (46) బాదా రాంప్రసాద్ (26) ప్రమాదవశాత్తు రెండురోజులు క్రితం ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఇద్దరూ ఎఒఎల్ పరిశ్రమలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. పనికి వెలుతుండగా ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడ్డారు. నారాయణప్పడు తలకు బలమైన గాయమైంది. విజయనగరంలోని కాన్వీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తలకు ఆపరేషన్ నిమిత్తం రూ. 5 లక్షలు వరకూ ఖర్చు చేశారు. ఇంకా కోలుకోవడానికి సమయం పడుతొందని వైద్యులు తెలిపారు. పేద కుటుంబానికి పెద్ద కష్టం రావడంతో ఆర్థిక స్తోమత లేక విలవిలలాడుతున్నారు. ఎవరైనా దాతలు స్పందించి వైద్య సేవలు నిమిత్తం సహాయం అందించాలని కోరుతున్నారు. తనకు కూడా కాలు, చేయి విరిగిపోయిందని బాదా రాంప్రసాద్ చెబుతున్నారు. ఎవరైనా స్పందించి పేద కుటుంబానికి సహాయం చేయాలనుకున్న వారు ఈ నెంబర్‌కు 79895 22349 సహాయం అందించాలని కోరుతున్నారు.

గాయపడిన రాంప్రసాద్

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతిని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్య అతిధులుగా పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు , పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఆ పార్టీ ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి అదితి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి అశోక్‌గజపతిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. పేర్ల వారి వీధిలో గల చెవిటి మూగ పాఠశాల విద్యార్థులు 21 మంది ఏడాది పాటు దత్తత తీసుకునేందుకు పలువురు అందజేసిన రూ 1,26,000 విరాళాన్ని అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా అందజేశారు.

తెర్లాం: మండలంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేశారు.

నెల్లిమర్ల: స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీ కన్యకాపరమేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పూసపాటిరేగ : టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు మంగళవారం ఎన్‌టిఆర్ 101వ జయంతోత్సవం సందర్భంగా స్థానిక రాజవీధిలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.

విజయనగరం: ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అశోక్ గజపతిరాజు

శృంగవరపుకోట: స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి లక్కవరపుకోట మండల కేంద్రంలో గల తన స్వగృహంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఎస్‌కోట పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బొబ్బిలి: బొబ్బిలి కోటలో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు ఆర్ శరత్, వి.సత్యనారాయణ కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు పనిచేస్తామని చెప్పారు.

నెల్లిమర్ల: వృద్ధులకు పళ్లు పంపిణీ చేస్తున్న ఆనంద్, కర్రోతు బంగార్రాజు

ఎస్‌కోట: ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొంప కృష్ణ, తదితరులు